క్లుప్తంగా

చిన్నారులకు వేసవి శిక్షణ తరగతులు



పామర్రు: వేసవి సెలవులను చిన్నారులు సద్వినియోగం చేసుకునే విధంగా వారికి శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నామని క్రైస్తవ సంక్షేమ సంఘ అధ్యక్షుడు సాల్మన్ కొల్లాబత్తుల పేర్కొన్నారు. స్థానిక విజన్ లైఫ్ సెంటర్‌లో శుక్రవారం చిన్నారులకు శిక్షణ తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి సెలవుల్లో విద్యార్థులను ఎంపిక చేసి, వారికి పలు అంశాల్లో శిక్షణ ఇచ్చామన్నారు. శిక్షణ పూర్తి చేసిన వారికి సర్టిఫికెట్లను అందజేశామని తెలిపారు. కార్యక్రమంలో పీటర్ సాల్మన్, కె.శామ్యూల్ పాల్గొన్నారు.

రేపు పూర్వ విద్యార్థుల సమ్మేళనం

తోట్లవల్లూరు: స్థానిక జెడ్పీ పాఠశాల్లో ఈ నెల 25న పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించనున్నట్లు నిర్వాహక కమిటీ ప్రతినిధి గొరిపర్తి సూర్యనారాయణ తెలిపారు. పాఠశాల్లో 1996–97 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులంతా ఈ సమ్మేళనానికి విచ్చేస్తున్నట్లు పేర్కొన్నారు.

కిశోర బాలికలకు అవగాహన



గుడ్లవల్లేరు: కిశోర బాలికలకు అంగలూరు అంగన్‌వాడీ కేంద్రంలో ఉన్నత విద్యపై అవగాహన సదస్సును ఐసీడీఎస్ సీడీపీఓ విజయ ఫ్లొరెన్స్ శుక్రవారం నిర్వహించారు. కిశోర వికాసంపై వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా ఉన్నత విద్యతో పాటు ఆ విద్యపై నైపుణ్యాలు, కెరీర్ మార్గ దర్శకత్వంపై వివరించారు. జూన్ 10వ తేదీ వరకు నిర్వహించే ఈ శిక్షణ తరగతులను కిశోర బాలికలు, వారి తల్లిదండ్రులు వినియోగించుకోవాలని కోరారు. సూపర్‌వైజర్ వాణి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

జీఓ 1/19 అమలు హర్షణీయం



గుడివాడ టౌన్: ఆర్టీసీ కార్మికుల ప్రధాన సమస్య అయిన జీఓ 1/19 అమలుకు ఆర్టీసీ యాజమాన్యం అంగీకరించడం హర్షణీయమని నేషనల్ మజ్దూర్ యూనియన్ నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం ఆర్టీసీ డిపో ఎదుట హర్షం ప్రకటించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ నేషనల్ మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో చేసిన అనేక పోరాటాల ఫలితంగా ప్రభుత్వం ఈ జీఓ అమలుకు అంగీకారం తెలిపిందన్నారు. జీఓ అమలుతో పాటు ఇతర సమస్యలు కూడా పరిష్కరించాలని నాయకులు కోరారు. కార్యక్రమంలో ఎస్ఎంయూ డిపో కార్యదర్శి జీఎల్ఎన్‌వీకే మూర్తి, అధ్యక్షుడు వాసు, గ్యారేజ్ కార్యదర్శి సురేష్, రీజినల్ కమిటీ సభ్యుడు బసవయ్య, కోశాధికారి సారథి, నాగరాజు పాల్గొన్నారు.

రోడ్డు బురదమయం



నందివాడ: మండలంలోని పోలుకొండ గ్రామంలో ప్రధాన అంతర్గత రోడ్డు అధ్వానంగా మారింది. గ్రామంలోని జీపీకే రోడ్డు నుంచి ఎస్ఎస్ శ్మశానవాటిక వరకు ఉన్న అంతర్గత సీసీ రోడ్డుపై మురుగునీరు ప్రవస్తుండడంతో బురదమయంగా మారింది. జెడ్పీ హైస్కూల్ ఎదురుగా ఉన్న ప్రాంతంలో రోడ్డు కుంగిపోయి మురుగునీరు ప్రవహిస్తోంది. చిన్నపాటి వర్షాలకు రోడ్డు బురదయమంగా మారుతోంది. దీంతో ఎస్సీ కాలనీ వాసులు ఎక్కడికి వెళ్లాలన్నా ఈ రోడ్డుపై ఇబ్బందిపడుతున్నారు. రోడ్డుకి ఇరువైపులా డ్రెయినేజీ పూడికను పంచాయతీ వారు ఎప్పటికప్పుడు తీయక పోవడంతో ఈ విధంగా మారుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డును అభివృద్ధి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

విశ్రాంత డీఈఓ సుబ్బారావు మృతి



సుబ్బారావు (ఫైల్)

గుడివాడ టౌన్: పట్టణానికి చెందిన విశ్రాంత డీఈఓ దేవిరెడ్డి వెంకట సుబ్బారావు(87) గురువారం రాత్రి స్థానిక టీచర్స్ కాలనీలోని తన నివాసంలో మృతిచెందారు. ఆయన ప్రకాశం జిల్లా విద్యాశాఖాధికారిగా పనిచేసి 1995లో ఉద్యోగ విరమణ చేశారు. అనంతరం గుడివాడలోని ఆయన స్వగృహంలో నివాసం ఉంటూ మృతిచెందారు. ఈయనకు ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

స్థలాలు ఇచ్చారు.. వసతులు మరిచారు

ఏళ్లు గడుస్తున్నా గృహాలు నిర్మించుకోలేని లబ్ధిదారులు



మండవల్లిలోని తరుగుమూలలో పూడిక లేక నీటితో నిండిన నివేశన స్థలాలు

మండవల్లి: మండవల్లిలో పేదలకు స్థలాలు అందజేసి 15 ఏళ్లు గడుస్తున్నా వాటి గురించి పట్టించుకున్న నాథుడే లేడు. గతంలో అధికారులు నాలుగు ఎకరాల పట్టా భూమిని కొనుగోలు చేసి సుమారు 110 మంది లబ్ధిదారులకు స్థలాలు అందించారు. ఇది పంట భూమి కావడంతో చిన్నపాటి వర్షం వచ్చినా మోకాళ్ల లోతు నీరు నిలుస్తోంది. అప్పటి నుంచి ఈ స్థలాల్లో పూడిక చేయాలని లబ్ధిదారులు అధికారులను వేడుకుంటూనే ఉన్నా ఫలితం లేదు. పూడిక చేసి గృహ నిర్మాణాలు చేపడతామని కొంతమంది అధికారులు చెప్పినా, అవి కార్యరూపం దాల్చలేదు. తప్పనిసరి పరిస్థితుల్లో కొందరు లబ్ధిదారులు తమ స్థలాలకు రహదారి సౌకర్యం ఏర్పాటు చేసుకున్నారు. స్థలాలకు సంబంధించి ఒరిజినల్ పట్టాలు ఇంతవరకూ అందజేయలేదు. పట్టాల జిరాక్స్ కాపీలు మాత్రం లబ్ధిదారులకు ఇచ్చారు. ఒరిజినల్ పట్టాలు ఇవ్వండి అని అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకున్న దాఖలాలు లేవని లబ్ధిదారులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, పాలకులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

వెంటనే పూడిక చేయాలి



మండవల్లి తరుగు మూలన పేదలకు ఇచ్చిన నివేశన స్థలాల్లో వెంటనే పూడిక చేయాలి. పూడిక చేయని కారణంగా లబ్ధిదారులు ఎవరూ ఇప్పటి వరకు ఇళ్లను నిర్మించుకోలేకపోయారు. ప్రభుత్వం పూడిక నిర్వహించి, పేదలకు గృహ నిర్మాణాలు చేపట్టాలి

– ఎల్ఎస్ భాస్కరరావు, ఐక్య వేదిక జిల్లా ఉపాధ్యక్షుడు

సమస్యలు పరిష్కరించాలి



పేద ప్రజలకు గృహ నిర్మాణాలకు స్థలాలు ఇచ్చారు. అయితే వారికి కావాల్సిన సౌకర్యాలు మరిచారు. కొందరు లబ్ధిదారులు గృహ నిర్మాణాలు చేసుకోవడానికి ముందుకు వచ్చారు. నివేశన స్థలాలు నీటిలో మునిగి ఉండడంతో ఏమి చేయలేక వదిలి వేశారు. ఇప్పటికైనా స్థలాల్లో పూడిక చేసి సమస్యలు పరిష్కరించాలి.

– మన్నేపల్లి ఆదాం, మండవల్లి

కైకాల నడయాడిన కౌతవరం



కౌతవరంలో స్నేహితులతో కైకాల పర్యటన (ఫైల్)



కైకాల తాత పేరిట నిర్మించిన ఆస్పత్రి

- రేపు కౌతవరంలో సినీనటుడు కైకాల విగ్రహావిష్కరణ
- కైకాల భార్య నాగేశ్వరమ్మ చేతుల మీదుగా ప్రారంభం

గుడ్లవల్లేరు: నవరస నటనా సార్వభౌమ కైకాల సత్యనారాయణ అంటే తెలియని తెలుగు సినీ ప్రేక్షకులు ఉండబోరు అంటే అతిశయోక్తి కాదు. గుడ్లవల్లేరు మండలం కౌతవరంలో పుట్టి పెరిగిన కైకాలకు ఈ ప్రాంత వాసులకు మాత్రం ఆయన తమలో ఒకడిగా ఆ నాటి తరం నుంచి నిన్నటి తరం వారి వరకు తెలుసు. కైకాల లక్ష్మీనారాయణకు 1935 జూలై 25న సత్యనారాయణ జన్మించారు. కౌతవరంలో విద్యాభ్యాసం ప్రారంభించి, గుడ్లవల్లేరు ఎస్ఈఆర్ఎం హైస్కూల్లో చదువుకునేందుకు నిత్యం కౌతవరం నుంచి కాలినడకన వెళ్లేవారు. ఆ తర్వాత ఉన్నత విద్యను గుడివాడ, విజయవాడలో కైకాల కొనసాగించారు. 1960లో నాగేశ్వరమ్మతో ఆయనకు వివాహం జరిగింది. కౌతవరంలో గ్రామస్తులు ఏర్పాటు చేసిన కైకాల విగ్రహాన్ని ఆదివారం ఆయన భార్య నాగేశ్వరమ్మ చేతుల మీదుగా ప్రారంభించనున్నారు. ఆయన కైకాల లక్ష్మీనారాయణ, కుమారులు కైకాల రామారావు, కైకాల నాగేశ్వరరావు కూడా ఈ ఆవిష్కరణకు రానున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

చిన్ననాటి మధుర స్మృతులు ఎన్నెన్నో..

కైకాల చిన్ననాటి నుంచే నాటకాలపై మక్కువ చూపారు. ఆజానబాహుడు కావటంతో ఆయన్ను తన స్నేహితులు సినిమా యాక్టర్‌లా ఉన్నావంటూ ప్రోత్సహించారు. తాళ్లూరి వెంకటనారాయణ చెరువు అన్నా.. ఆ చెరువు గట్టునే ఉండే మర్రి చెట్టు అన్నా ఆయనకు ఎంతో ఇష్టం. ఆ చెరువులోని చేపలను ఆయన ఎంతో ఇష్టంగా తినేవారు. తన స్నేహితులతో కలసి మంచి బెల్లం, పప్పు చెక్క తింటూ సరదాగా గడిపేవారు. కౌతవరంలో తమ తాతయ్య కంభంమెట్టు రామయ్య పేరిట ప్రభుత్వ సహకారంతో ప్రసూతి కేంద్రాన్ని స్థాపించారు. అనంతరం ఆయన ఎంపీగా పని చేసిన కాలంలో సుమారు రూ.40 లక్షల ప్రభుత్వ వ్యయంతో కొత్త ఆస్పత్రిని కూడా ఏర్పాటు చేసేందుకు కృషి చేశారు. కౌతవరం–చేవేంద్ర రోడ్డు నిర్మాణం కూడా ఆయన చలవేనని గ్రామస్తులు తెలిపారు. ఆయన ఆరోగ్యం బాగుండే సమయంలో కౌతవరం అరుదుగా వచ్చేవారు. 20 ఏళ్ల క్రితం అయితే దగ్గర షూటింగ్ ఉన్న ప్రతిసారీ గ్రామానికి వచ్చి తమ స్నేహితులతో షూటింగుల్లో ముచ్చట్లు చెప్పేవారు.



గ్రామంలో మర్రి చెట్టు



కైకాల కృషితో అప్పట్లో నిర్మించిన కౌతవరం–చేవేంద్ర రోడ్డు

రానున్నది జగనన్న 2.0 ప్రభుత్వం

మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్



కార్యకర్తలతో మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్

మొవ్వ: రానున్నది జగనన్న 2.0 ప్రభుత్వం అని.. వైఎస్సార్ సీపీని నమ్ముకున్న ప్రతి నాయకుడికి, కార్యకర్తకు పార్టీ అండగా ఉంటుందని పామర్రు మాజీ ఎమ్మెల్యే, ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కైలే అనిల్‌కుమార్ పేర్కొన్నారు. మొవ్వ గ్రామంలోని పార్టీ జిల్లా యాక్టివిటీ కార్యదర్శి దేవభక్తుని రాము ఇంటి వద్ద శుక్రవారం కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కైలే అనిల్‌కుమార్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో మండల రాజకీయాలపై, కూటమి ప్రభుత్వం చేస్తున్న అక్రమాలు, ప్రజల సమస్యలపై చర్చించారు. పార్టీ కార్యక్రమాల్లో ఉద్యమాల్లో ప్రతి కార్యకర్త పాలు పంచుకుని కూటమి ప్రభుత్వం చేస్తున్న వైఫల్యాలను, దోపిడీలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. అలాగే గ్రామ, మండల పార్టీ నాయకులకు ఎప్పుడూ అందుబాటులో ఉంటూ కార్యకర్తకు ఎటువంటి కష్టం వచ్చినా అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు రాజులపాటి రాఘవులు, టీపీటీసీలు దగాని బాపూజీ, సమ్మెట ఆంజనేయులు, నాయకులు తాతినేని లక్ష్మీ కాంత్, తాతా రాంబాబు, కంభం దుర్గా ప్రసాద్, శీలం వెంకటేశ్వరరావు, చిరువోలు సుధాకర్, అయ్యంకి జీవరత్నం పాల్గొన్నారు.

గుడివాడ అభివృద్ధికి రూ.136 కోట్లు



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాము

గుడివాడరూరల్: పట్టణాభివృద్ధికి వివిధ ప్రభుత్వ శాఖల నుంచి రూ.136 కోట్లు మంజూరయ్యాయని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము తెలిపారు. రాజేంద్రనగర్‌లోని ఆయన స్వగృహంలో ఏపీ అర్బన్ గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్, సెంట్రల్ డిజైన్ ఆఫీస్, మున్సిపల్ అధికారులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ త్వరలోనే టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి పనులు మొదలు పెడతామన్నారు. సమావేశంలో ఏపీ అర్బన్ గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ ఎస్ఈ నరసింహారావు, సెంట్రల్ డిజైన్ ఆఫీస్ ఎస్ఈ శివకుమార్ ,మున్సిపల్ కమిషనర్ సింహాద్రి మనోహర్, మున్సిపల్ ఇంజినీర్ ఏఎస్ఎన్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గుడివాడ–కంకిపాడు రోడ్డు పూర్తి చేయాలి



వినతిపత్రాలను ప్రదర్శిస్తున్న భవిష్యత్ భద్రతాదళం సభ్యులు

గుడివాడ టౌన్: గుడివాడ–కంకిపాడు రోడ్డు నిర్మాణం పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయని, వాటిని తక్షణమే పునఃప్రారంభించాలని భవిష్యత్ భద్రతాదళం సభ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు రోడ్లు భవనాల శాఖ అధికారులకు శుక్రవారం వినతిపత్రాన్ని పంపించారు. ఈ సందర్భంగా దళం సభ్యులు మాట్లాడుతూ హైకోర్టు ఆదేశాల మేరకు మొత్తం 21 కిలోమీటర్లు గుడివాడ–కంకిపాడు రోడ్డును పూర్తిచేస్తామని హామీ ఇచ్చిన ఆర్‌అండ్‌బీ అధికారులు సగం పనులు పూర్తి చేసి నిలుపుదల చేశారని మిగిలిన పనులు పూర్తి చేయకపోతే రానున్న వర్షాకాలంలో రోడ్డు తిరిగి పూర్వ స్థితికి చేరుకుంటుందని తెలిపారు. తక్షణమే రోడ్ల పనులు ప్రారంభించాలని కోరారు. కార్యక్రమంలో భవిష్యత్ భద్రతాదళం కన్వీనర్ వైవీ మురళీకృష్ణ, సభ్యులు ఎండీ తెహర్‌బాషా, జి. పూర్ణచంద్రరావు, డి. దుర్గారావు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

పమిడిముక్కల: ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ప్రగతి పథంలో మన పామర్రు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా పేర్కొన్నారు. ప్రజల సమస్యలపై మండల స్థాయి అధికారులతో సమీక్ష జరిపి, సమస్యలకు పరిష్కారం లభించే వరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. వీరంకిలాకు కల్యాణ మండపంలో శుక్రవారం జరిగిన ప్రగతి పథంలో పామర్రు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పల్లె నిద్ర, పల్లెబాట ద్వారా సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. రేషన్‌కార్డులకు సంబంధించి ఏవైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. వాటిని జేసీ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని తహసీల్దార్‌కు సూచించారు. ప్రజల సమస్యలపై సరిగా స్పందించని ఉద్యోగులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. రహదారుల అభివృద్ధి, రేషన్‌కార్డులు, ఇళ్ల స్థలాల కోసం పలువురు ఎమ్మెల్యేకు అర్జీలు అందజేశారు. వీరంకిలాకు ఎన్టీఆర్ కాలనీ, హనుమంతపురం బీసీ కాలనీల్లో మురుగునీరు పోక ఇబ్బందులు పడుతున్నామని, డ్రెయిన్‌లు పూడికతీయాలని కోరారు. కపిలేశ్వరపురం ముత్రాసిపాలెంకు రహదారి, తాగునీరు కావాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ నవీన్‌కుమార్, ఈఓఆర్డీ వెంకటేశ్వరరావు, వైద్యులు సైరా కటూన్, సర్పంచ్ ముళ్లపూడి సునీత, టీడీపీ మండల అధ్యక్షుడు రాజులపాటి శ్రీనివాసరావు, కృష్ణాపురం డీసీ చైర్మన్ నాదెళ్ల సుబ్రమణ్యం పాల్గొన్నారు.

విద్యావికాస్ అభినందనోత్సవం

గుడివాడ టౌన్: విద్యావికాస్ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్ చిన్నారుల అభినందనోత్సవం శుక్రవారం నిర్వహించారు. ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ముఖ్య అతిథిగా పాల్గొని 10వ తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను అభినందించారు. పాఠశాలకు చెందిన కె. పూర్ణిమ, ఎస్. లక్ష్మీనరసింహ నాగసాయి, పి. తరణీసాయిలు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించగా వారిని ఎమ్మెల్యే అభినందించారు. అనంతరం జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు చిన్నారులు, తల్లిదండ్రులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో విద్యావికాస్ డైరెక్టర్ కొమ్మినేని సాంబశివరావు పాల్గొన్నారు.

పశువుల దాణా పంపిణీ

తోట్లవల్లూరు: ప్రభుత్వం రాయితీపై అందిస్తున్న పశువుల దాణాను పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలని టీడీపీ మండల అధ్యక్షుడు వీరపనేని శివరాం అన్నారు. మండలంలోని పెనమకూరులో పశుపోషకులకు పశువుల దాణా పంపిణీ శుక్రవారం జరిగింది. 50 శాతం రాయితీతో రైతులకు పశువుల దాణా అందిస్తున్నట్లు శివరాం తెలియజేశారు. పశువైద్యాధికారి డాక్టర్ ప్రకాష్‌బాబు, నాయకులు తలశిల శ్రీనివాస్‌ప్రసాద్, మరీదు ధర్మారావు, పశుపోషకులు పాల్గొన్నారు.

ఈసెట్‌లో వికాస్ రెయిన్‌బో విద్యార్థిని ప్రతిభ



గుడివాడ టౌన్: ఈసెట్ పరీక్షల్లో తమ విద్యార్థిని ప్రతిభను ప్రదర్శించి 57వ ర్యాంక్ సాధించారని వికాస్ రెయిన్‌బో కరస్పాండెంట్ రామచంద్రశేఖర్ తెలిపారు. శుక్రవారం పాఠశాల కార్యాలయంలో ర్యాంక్ సాధించిన తురకా మొనాలిసాను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొనాలిసా రాష్ట్ర స్థాయిలో 57వ ర్యాంక్ సాధించిందని పేర్కొన్నారు. తమ పాఠశాల వేసిన పునాది ఇందుకు నిదర్శనమని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం అరుణ, ప్రైమరి హెచ్ఎం ఎం. వాణి, ఫ్యాకల్టి విజయ్‌వర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

పమిడిముక్కల ఎంపీడీఓగా సీతారామరాజు



పమిడిముక్కల: పమిడిముక్కల ఎంపీడీఓగా వి.సీతారామరాజు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. వీరులపాడు ఈఓఆర్డీగా పని చేస్తూ ఉద్యోగోన్నతిపై పమిడిముక్కల వచ్చారు. ఈఓఆర్డీ దేవరపల్లి వెంకటేశ్వరరావు నుంచి బాధ్యతలు స్వీకరించారు. కార్యాలయ సిబ్బంది, కార్యదర్శులు ఎంపీడీఓకు పుష్ప గుచ్ఛం అందజేసి సత్కరించారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం

మాజీ ఎమ్మెల్యే అనిల్‌కుమార్



మాధవరెడ్డిని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్

పామర్రు: పార్టీ కోసం అహర్నిశలు శ్రమించిన కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కైలే అనిల్ కుమార్ అన్నారు. గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు బొమ్మారెడ్డి మాధవరెడ్డి గుండె శస్త్ర చికిత్స చేయించుకున్నారు. ఆయన్ను అనిల్ కుమార్ శుక్రవారం పరామర్శించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీ అభ్యున్నతికి కార్యకర్తలు చేసిన కృషి అభినందనీయమన్నారు. కార్యకర్తలకు పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని అధైర్య పడవద్దన్నారు. అన్ని విధాలా ఆదుకుంటామన్నారు. త్వరగా కోలుకోవాలని ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు తాడిశెట్టి శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ ఆరేపల్లి శ్రీనివాసరావు, నాయకులు బొమ్మారెడ్డి అప్పిరెడ్డి, కో–ఆప్షన్ సభ్యులు హస్మతుల్లా, ఉప సర్పంచ్ దేవిరెడ్డి బాల వెంకటేశ్వరరావు, దేవిరెడ్డి భాస్కరరెడ్డి, ఆరేపల్లి శ్రీహరి పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప స్వామి ఆలయ ప్రతిష్ట



ప్రతిష్ఠించిన అయ్యప్ప స్వామి విగ్రహం



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా

పామర్రు: స్థానిక సోమేశ్వరస్వామి ఆలయం పక్కన నూతనంగా నిర్మించిన అయ్యప్ప స్వామి ఆలయ శిఖర, విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠోత్సవాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. తొలుత ఆలయంలో చతురస్థావరచనలు, గర్తన్యాసం, రత్నన్యాసం చేసి అనంతరం ఉదయం 7.41 గంటలకు నూతన ఆలయ శిఖర విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం పూర్ణాహుతి చేసి భక్తులకు స్వామివారి దర్శనం కల్పించారు. ఆలయంలో చలమచర్ల మురళీ కృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయ నిర్మాణ దాతలు తాడిశెట్టి నాగేశ్వరరావు జ్ఞాపకార్థం భార్య విజయలక్ష్మి, కుమారులు సత్యనారాయణ ఉషారాణి, మధు దివ్యభారతి ల సౌజన్యంతో విగ్రహ ప్రతిష్టా కార్యక్రమాలను జరిపించారు. స్థానిక ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా ఈ కార్యక్రమంలో పాల్గొని స్వామికి విశేష పూజలను చేశారు. అనంతరం వచ్చిన వేలాది మంది భక్తులకు స్వామి అన్న ప్రసాదాన్ని వితరణ చేశారు. ఆలయ వ్యవస్థాపకులైన తాడిశెట్టి బశివరావు, పద్మజ, సత్యనారాయణ ఉషారాణి, మధుశేఖర్ దివ్యభారతి, తాడిశెట్టి సతీష్ పావని, గురుస్వాములు వల్లూరిపల్లి చక్రవర్తి, బొగ్గరపు సాయిబాబు, మాగంటి వెంకటరత్నం, నాని గురుస్వామి, కలకండ అంజిబాబు, స్వర్ణ శివ, తాడిశెట్టి కుమార్ పాల్గొన్నారు.

సైనిక్ స్కూల్ పరీక్షలో ఉత్తీర్ణత



విద్యార్థి నాగసాయి

కైకలూరు: ఆల్ ఇండియా సైనిక్ స్కూల్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్–2025లో కైకలూరుకు చెందిన టౌన్ కానిస్టేబుల్ కె.రవికుమార్ కుమారుడు రేవంత్ నాగసాయి ఉత్తీర్ణత సాధించాడు. ఈ నెల 5న విజయవాడలో పరీక్ష రాశాడు. అన్నమయ్య జిల్లా కిలికిరి సైనిక్ స్కూల్లో సీటు దక్కింది.

యోగాతో మానసిక ప్రశాంతత

కైకలూరు: యోగ సాధనతతో మానసిక ప్రశాంత లభిస్తుందని ఎంపీడీఓ ఆర్.ఫణీంద్ర పేర్కొన్నారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో యోగా తరగతులను శుక్రవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 21 నుంచి జూన్ 21 వరకు యోగా సాధనపై వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు.

వైఎస్సార్ సీపీ మండల కమిటీ సభ్యుల నియామకాలు

కైకలూరు: వైఎస్సార్ సీపీ కైకలూరు మండల కమిటీ సభ్యుల జాబితాను పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో తాడేపల్లి కేంద్ర కార్యాలయం శుక్రవారం విడుదల చేసింది. మండల వైస్ ప్రెసిడెంట్లుగా పెంటా అనిల్ కుమార్, తోట తులసీరావు, జనరల్ సెక్రటరీలుగా పేతల విద్యామణి, తేరా బాలస్వామి, యాళ్ల లోకేష్, ట్రెజరర్‌గా కరేటి రాంబాబును నియమించారు. సెక్రటరీలుగా చేవేటి ఏసు, పెనుమాల అంటోని, నెలటూరి సాల్మన్‌రాజు, బోడావుల అప్పయ్య, ఈదా వెంకటలక్ష్మి నియమితులయ్యారు. ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా బొడ్డు ధర్మకుమారి, కట్టా కోటేశ్వరరావు, బండి విష్ణువర్ధన్, కాగిత రామస్వామి, చింతల ఆంటోని, భాష్యం కిషోర్, దాకవరపు అర్జున్, మత్తే మేజర్ నరసింహులు, గుజ్జుల యాకోబు, చాగంటి రాజు, అలుమోలు చందు, బోయిన గోపిరాజు, గంగుల రాజేంద్ర ప్రసాద్, నేతల నోవాహు, ఉలిసి కృష్ణంరాజు, కురేళ్ళ సంజీవరావు, కాగితాల కొండమ్మ, గొర్ల బుచ్చిబాబు, ఎరిచర్ల హరీష్, సాయల శ్యామలరావు, అద్దంకి లీలాప్రసాద్, ఏలేటి సుజాత, బోడిపోగు సునీత, కొట్టి నాగబాబు(పాము), బుసనబోయిన రాధాకృష్ణ, పడమట రాంబాబు, ఆగోళ్ల వేంకటేశ్వరరావు, కట్టా జగన్నాథం, మాడపాటి రాఘవ, శింగంశెట్టి సాగర్, చేబ్రోలు కుటుంబరావు, తోట జ్యోతి, కటికతల అబ్రహం నియమితులయ్యారు.

నేడు అహల్యాబాయి త్రి శతాబ్ద జయంత్యుత్సవం

కైకలూరు: రాజమాత దేవీ అహల్యాబాయి హుల్కర్ త్రి శతాబ్ద జయంతి ఉత్సవం కైకలూరు సీతారామ ఫంక్షన్ హాల్లో శనివారం సాయంత్రం నాలుగు గంటలకు జరుగుతుందని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ తెలిపారు. బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.మధుకర్‌జీ ముఖ్య అతిథిగా విచ్చేస్తారని పేర్కొన్నారు.

పెద్దింట్లమ్మ దేవస్థానంలో ఉద్యానవనం



ఉద్యానవనం ఏర్పాట్లపై పరిశీలనకు వచ్చిన ముడా చైర్మన్ ప్రసాద్, ఎమ్మెల్యే కామినేని

కైకలూరు: కొల్లేటికోట పెద్దింట్లమ్మ దేవస్థాన సమీపంలో భక్తులు, పర్యాటకుల కోసం ఉద్యానవనాన్ని ఏర్పాటు చేస్తామని మచిలీపట్నం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(ముడా) చైర్మన్ మట్టా ప్రసాద్ తెలిపారు. ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ ఆహ్వానం మేరకు ముడా చైర్మన్ కొల్లేటికోట పెద్దింట్లమ్మ దేవస్థానం వద్ద ఎమ్మెల్యేతో కలసి శుక్రవారం పరిశీలించారు. ముందుగా నాయకులంతా పెద్దింట్లమ్మను దర్శించుకున్నారు. ముడా చైర్మన్ మాట్లాడుతూ నియోజకవర్గంలో రెండు ఎకరాలు పైగా ప్రభుత్వ భూమి సమకూరిస్తే మరిన్ని ఉద్యానవనాలను ఏర్పాటు చేసే అవకాశం ఉందన్నారు. అనంతరం వరహాపట్నం గ్రామాన్ని పరిశీలించారు. మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్‌రావు, ఎంపీపీ అడవి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.